వేడుకగా ప్రారంభమైన గోవిందుడి జ్యేష్ఠాభిషేకం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠాభిషేకం వేడుకగా ప్రారంభమైంది. మాసంలో గోవిందరాజస్వామికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి కైంకర్యాలు చేశారు. శత కలశ స్నపనం, మహా శాంతి హోమం చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయంగార్ స్వామి, చిన్న చిన్నజీయంగార్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ప్రధానార్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఏఈవో రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయులు పాల్గొన్నారు.


జ్యేష్ఠాభిషేకం సందర్భంగా కల్యాణ మండపం వేదికపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి

హర్షిత్‌రెడ్డి మానవత్వం

భాకరాపేట: ఎర్రావారిపాళెం–చిన్నగొట్టిగల్లు రోడ్డులోని రంగన్నగారిగడ్డ క్రాస్ సమీపంలో శుక్రవారం మామిడి కాయలతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడింది. అదే సమయంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చిన్నగొట్టిగల్లు నుంచి ఎర్రావారిపాళెం వెళుతున్నారు. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన చూసి తన వాహనాన్ని ఆపి డ్రైవర్ రామకృష్ణను కాపాడారు. తన కారు లోని ఫస్ట్ ఎయిడ్ కిట్టు తీసుకుని ప్రథమ చికిత్స చేశారు. అనంతరం రైతు సుబ్రమణ్యంకు ధైర్యం చెప్పారు. స్వల్పంగా గాయపడిన డ్రైవర్‌ను మరో వాహనంలో చిన్నగొట్టిగల్లు ఆసుపత్రికి పంపించారు.

బడికి వెళ్లి గాయపడిన విద్యార్థిని మృతి

చంద్రగిరి (తిరుపతి రూరల్) : చంద్రగిరి పట్టణం అక్కగార్ల కాలనీలో ప్రభుత్వ బడికి వెళ్లిన విద్యార్థిని ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందింది. చంద్రగిరి వికలాంగుల కాలనీకి చెందిన మునిరాజ కుమార్తె లలిత స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఈ నెల 26న బడిలో ఆడుకుంటూ మెట్లపై పడి గాయపడిందని స్థానికులు ఫోన్ ద్వారా మునిరాజకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు బాలికను చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి తిరుపతి రూయాలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం బాలిక మృతి చెందింది. మృతురాలి తండ్రి మునిరాజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ ఘటనపై ఎంఈఓ లలితకుమారిని వివరణ కోరగా విద్యార్థిని అనారోగ్యం కారణంగానే మృతి చెందిందని ఉపాధ్యాయుడు సిద్ధయ్య తెలిపారని, సమాచారం ఇవ్వకపోవడంపై ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు

భాకరాపేట : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగా సేవలు అందించనున్నట్టు చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమై జగనన్న సురక్ష అమలుపై సమీక్షించారు. మండలంలో 6 నుంచి 25వ తేదీ వరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

శ్రీనివాస సేతు గడ్డర్ల నిర్మాణానికి ట్రయల్ రన్

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. రామానుజ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డులోని రైల్వే లైన్‌పై ఐరన్ గడ్డర్లను అమర్చే ప్రకియకు శుక్రవారం ట్రయల్ రన్ చేపట్టారు. ఈ పనులను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, రైల్వే అధికారులు పూజలు చేసి ప్రారంభించారు. కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే లైన్లపై ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు పనులు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. ఆరు గడ్డర్లు అమర్చేందుకు ఎంత సమయం తీసుకుంటుందనే దానిపై అంచనాకు వచ్చినట్టు పేర్కొన్నారు. శనివారం నుంచి పనులను వేగవంతం చేసి మరో పది రోజుల లోపు పూర్తి చేస్తామని వివరించారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, తిరుపతి రైల్వే స్టేషన్ అధికారులు కుప్పాల సత్యనారాయణ, కృష్ణ, సుబ్బారావు, ఆప్కాన్ స్వామి పాల్గొన్నారు.


పూజ చేస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే జగనన్న భూహక్కు అమలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): గ్రామాల్లో మెరుగైన భూ రికార్డుల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న భూహక్కు పథకాన్ని అమలు చేస్తున్నారని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి మండలం నరసింగాపురంలో జగనన్న భూహక్కు భూ రక్ష పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. డ్రోన్ కెమెరాతో సర్వే చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అధికారులు వందశాతం సర్వే చేసేందుకు సహకరించాలన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా ప్రజలకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ శిరీష, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బూడిదగట్టువారిపల్లిలో గంగమ్మకు పొంగళ్లు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం బూడిదగట్టువారిపల్లిలో శుక్రవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గంగమ్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామస్తులు అంబలి పోశారు. పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా చిన్న రామాపురం పంచాయతీ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొత్తపాటి మదన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారి జాతరకి మదన్‌మోహన్‌రెడ్డి రూ.5,116 విరాళంగా అందజేశారు. జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవారెడ్డి, సర్పంచులు అగరాల భాస్కర్‌రెడ్డి, రాగిణి, ఎంపీటీసీ అశ్విని, ప్రతాప్ రెడ్డి, చిరంజీవిరెడ్డి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తారు రోడ్డు పనుల పరిశీలన

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, దిగవూరు పంచాయతీల్లో జరుగుతున్న తారురోడ్డు పనులను శుక్రవారం పంచాయతీ రాజ్ తిరుపతి డివిజన్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుడా చైర్మన్ చెవిరెడ్డి చొరవ తీసుకుని తుడా నిధులతో మండలంలోని 13 పంచాయతీల్లో రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజాజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇంద్రకుమార్, గౌతమ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఐ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ(ఓఆర్ఐ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇదివరకు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ టి.సురేంద్రారెడ్డి పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో ప్రొఫెసర్ పీసీ.వెంకటేశ్వర్లును నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ మొహమ్మద్ హుస్సేన్ ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన

రామచంద్రాపురం: విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేపట్టాలని ఎంఈఓ–2 జయవేలు ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన శుక్రవారం కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల, బలిజపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు.

ఏబీబీఎం జోనల్ ఇన్‌చార్జ్‌గా విజయభాస్కర్‌శర్మ

తిరుపతి కల్చరల్: అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం చిత్తూరు, తిరుపతి, నెల్లూరు మూడు జిల్లాలకు జోనల్ ఇన్‌చార్జ్‌గా తిరుపతికి చెందిన గుండాకరం విజయభాస్కర్ శర్మను నియమించినట్లు ఏబీబీఎం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ తెలిపారు. ఆయన శుక్రవారం నియామక పత్రం అందజేశారు.ఆయనను పలువురు అభినందిచారు.

వేడుకగా మండలాభిషేకం

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మండలాభిషేకం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, యజమాని సంకల్పం, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ, మహాశాంతి, కుంభావాహన, కుంభారాధన, మహాశాంతి హోమం చేశారు.

నేడు ఎన్జీవో కాలనీలో జగనన్న సురక్ష ప్రారంభం

తిరుపతి తుడా: అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు శనివారం నుంచి వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఎన్జీవో కాలనీలోని సచివాలయంలో శనివారం ఉదయం 9.30 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనట్టు తెలిపారు. ఇందులో ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ పాల్గొంటారని వెల్లడించారు. ఆమె శుక్రవారం అధికారులతో కలిసి ఎన్జీవో కాలనీ, చెన్నారెడ్డి కాలనీ, ప్రకాశం పార్క్ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాలను పరిశీలించారు.

11 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : చంద్రగిరి, తిరుచానూరు, ఎమ్మార్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన ప్రమాదం కేసుల్లో 11 మందికి రూ.2,750 జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంథి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

గంజాయి కేసులో ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్ : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద 3 బ్యాగుల్లో 2 కిలోల గంజాయిని తరలిస్తున్న కేసులో తమిళనాడు తేని జిల్లా ఉత్తమపాళ్యం తాలూకా డి.రంగనాథపురానికి చెందిన పి.ప్రభాకరన్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ముందుగా అందిన సమాచారంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

చోరీ కేసులోఇద్దరికి..

తిరుపతి లీగల్ : తిరుమలలో తిరుమల సీఆర్‌వో ఆఫీస్ వద్ద శుక్రవారం హైదరాబాదుకు చెందిన భక్తుడి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన కేసులో ఇద్దరికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. విజయనగరం జిల్లా గరుగుబెల్లి మండలం కొత్తూరుకు చెందిన పి.దుర్గాప్రసాద్ అలియాస్ జ్యోతిప్రసాద్, కె.వరలక్ష్మి అపహరించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి..

తిరుపతి లీగల్ : తిరుపతి హథీరాంజీకాలనీకి చెందిన అనురాధ, ఆమె భర్తను హత్య చేసేందుకు యత్నించిన కేసులో సత్యనారాయణపురం జీవకోన రోడ్డు అన్నమయ్యనగర్‌కు చెందిన సీహెచ్.భార్గవ్, తిరుపతి మంగళం క్వార్టర్స్ బీటీఆర్ పురానికి చెందిన కె.ప్రవీణ్‌కుమార్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పాకాల : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లి దళితవాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చిన్నారులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఎస్ఐ రామకృష్ణ, డీటీ పరదేశి, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్, వీఆర్వో నిరోషా, జీఎంఎస్‌కే నీలావతి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో కారు ప్రమాదం

తిరుమల : తిరుమల అలిపిరి మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం ఒక కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. తిరుపతి ఇస్కాన్ మందిరానికి చెందిన కొందరు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి కారులో వస్తుండగా మొదటి ఘాట్ రోడ్డులోని మాల్వాడి గుండం మలుపు వద్ద కారు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ఆ సమయంలో కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో భక్తులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

భక్తులకు అన్నదానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పట్టణంలో వెలసిన మూలస్థానమ్మ ఆలయం వద్ద శుక్రవారం తానాటి మాధవి, చంద్రశేఖర్ రెడ్డి దంపతులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజలు చేశారు. 78 మంది మద్యం ప్రియులు మద్యం ముట్టమని అమ్మవారి ఎదుట సత్య ప్రమాణం చేశారు. అన్నదాతలను ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు అభినందించి సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సహకార శాఖ విద్యాధికారి సుధాకర్, స్వామెక్స్ అధ్యక్షురాలు శివకుమారి తెలిపారు. చంద్రగిరి మండలం స్వామెక్స్ మహాజన సభ సమావేశం శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పది మండలాల్లో 600 మంది సభ్యులతో 174 గ్రామాల్లో 1711 కుటుంబాల్లోని మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. స్వామెక్స్ సీఈవో విశ్వనాథం శివకుమారి, నిర్మల, నాగలత, నారాయణమ్మ, హుస్సేన్‌బీ పాల్గొన్నారు.